క్లుప్తంగా

ఆనంద నిలయానికి రూ.15 లక్షల సాయం



కలెక్టర్ కృతికా శుక్లాకు చెక్కు అందిస్తున్న కోరమండల్ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆనంద నిలయం వసతి గృహంలో అదనపు గదుల నిర్మాణానికి కోరమండల్ ఎరువుల కర్మాగారం సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.15 లక్షలు అందించింది. ఈ మేరకు కలెక్టర్ కృతికా శుక్లాకు ఆ సంస్థ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం కలెక్టరేట్‌లో చెక్కు అందజేశారు. ఈ నిధులతో ఆనంద నిలయంలో మరో రెండు గదులు నిర్మించి, పిల్లలకు వసతి కల్పించవచ్చని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ పద్మనాభం పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థానం నైట్ వాచ్‌మన్ సస్పెన్షన్

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం నైట్ వాచ్‌మన్ పి.నూకరాజును ఈఓ రాపర్తి రాజేశ్వరరావు సోమవారం సస్పెండ్ చేశారు. మద్యం తాగి, ఆలయానికి వస్తున్న భక్తుల పట్ల అమర్యాదగా మాట్లాడుతూండటంతో గత ఏడాది అతడికి నోటీసులు ఇచ్చారు. ఇకపై ఆ తప్పు చేయబోనని అప్పట్లో నూకరాజు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చాడు. అయినప్పటికీ ఆదివారం మద్యం తాగి ఆలయానికి విధులకు రావడమే కాకుండా, అర్చకులు, వారి కుటుంబ సభ్యులను కొట్టేందుకు ప్రయత్నించాడు. దీనిపై అర్చకుల ఫిర్యాదు మేరకు నూకరాజును సస్పెండ్ చేస్తూ ఈఓ ఆదేశాలు జారీ చేశారు. నూకరాజుపై అర్చకుడు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

అనాథ చిన్నారులకు స్వీట్ల పంపిణీ



దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఖుషీ అగర్వాల్

బోట్‌క్లబ్: దీపావళి సందర్భంగా నగరంలోని పలు అనాథ ఆశ్రమాలకు సరళా ఫుడ్స్ అధినేత వినోద్ అగర్వాల్ కుమార్తె ఖుషీ అగర్వాల్ ఆదివారం స్వీట్లు, దీపావళి సామగ్రి పంపిణీ చేశారు. వారితో కలసి వేడుకలు జరుపుకొన్నారు. బులుసు సాంబమూర్తి దివ్యాంగుల పాఠశాల, భానుగుడి వద్ద ఉన్న ప్రభుత్వ అంధుల పాఠశాల, బధిరుల పాఠశాల, ఉమా మనోవికాస కేంద్రంతో పాటు పలు పాఠశాల్లో ఉన్న చిన్నారులకు స్వీట్లు, బాణసంచా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు చెక్కా సుశీ, మూడో అదనపు జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆదిత్య కుమార్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిర్లంపూడి: బూరుగుపూడిలో ఆదివారం అర్ధరాత్రి పెంకుటిల్లు దగ్ధమైంది. జగ్గంపేట అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు కథనం ప్రకారం.. బూరుగుపూడిలో కొండమహంతి అప్పలరాజు అనే మహిళకు చెందిన పెంకుటింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్టు లక్ష్మణరావు తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి సోమవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. అమ్మవారి ఆలయం దిగువన నిర్మించిన మండపంలో ఈ హోమం నిర్వహించడం విశేషం. ఈ హోమ మండపాన్ని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి గావించారు. ఈఓ ఆజాద్ దంపతులతో పాటు మరో 20 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారు.

కార్తికం.. కమనీయం

- పవిత్ర మాసోత్సవాలకు ముస్తాబైన శివ సన్నిధానాలు
- ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- తెల్లవారుజాము నుంచే భక్తులకు అనుమతి



కార్తిక మాస ఉత్సవాలకు సిద్ధమైన కాకినాడ దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి దేవస్థానం

బోట్‌క్లబ్: పవిత్ర కార్తిక మాస ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. నగరంలోని పలు శివాలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యాన అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా ఇప్పటికే దేవదాయ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆయా ఆలయాల ఈఓలకు ఆదేశాలు అందాయి. తెల్లవారుజామున 3 గంటలకే శైవక్షేత్రాలను తెరవాల్సిందిగా ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలు ఆలయాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనాలు కూడా కల్పించనున్నారు. సాధారణ రోజుల్లో ఆయా ఆలయాల్లో ఉదయం 5 గంటల నుంచే భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. విశేష పర్వదినాల్లో కూడా భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. క్యూలో భక్తులకు మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

- అభిషేకాలు, దర్శనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని ఏర్పాట్లూ చేశామని స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీర వెంకట సత్యనారాయణ చెప్పారు. దాతల సహకారంతో నెల రోజులు పాటు భక్తులకు ప్రసాదం పంపిణీ చేయనున్నామన్నారు. ఈ నెల 17న నాగుల చవితి, 20న కార్తిక మాసం మొదటి సోమవారం, 26న జ్వాలాతోరణం, 27న కార్తిక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని వివరించారు.
- స్థానిక సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.
- స్థానిక దేవాలయం వీధిలోని అతి పురాతన బాలాత్రిపుర సుందరీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తికాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పిస్తామని చెప్పారు. అభిషేకం చేసుకొనే భక్తుల కోసం కూడా ఏర్పాట్లు చేశామన్నారు.
- స్థానిక రామారావుపేట అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం, జగన్నాథపురం శివాలయంతో పాటు నగరంలోని పలు ఇతర శివాలయాల్లో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ముస్తాబైన భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయం

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



కార్తిక మాసం సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా ఇప్పటికే శైవక్షేత్రాలకు చెందిన ఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీరు, ప్రసాదం పంపిణీకి చర్యలు తీసుకున్నాం. తెల్లవారుజాము నుంచే భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేస్తున్నాం. పారిశుధ్యం సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వడ్డి ఫణికుమార్, దేవదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్

సకాల చికిత్సతో న్యుమోనియా దూరం



సాన్స్ సమావేశాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కాకినాడ క్రైం: సకాలంలో చికిత్స అందించడం ద్వారా న్యుమోనియాను దూరం చేసి, మరణాలను నియంత్రించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరసింహ నాయక్ అన్నారు. ప్రపంచ న్యుమోనియా నివారణ దినం సందర్భంగా జీజీహెచ్ లెక్చర్ గ్యాలరీలో సాన్స్ ప్రోగ్రాం పరిధిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. పీడియాట్రిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నాయక్ మాట్లాడారు. శిశువులు, పిల్లల్లో న్యుమోనియాను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. బీసీజీ, డీపీటీ, హెచ్ఐబీ, పీసీబీ టీకాలు తప్పకుండా వేయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇన్‌చార్జి హెచ్ఓడీ డాక్టర్ విద్య మాట్లాడుతూ, న్యుమోనియాను ప్రాథమిక స్థాయిలో గుర్తించి, అందించాల్సిన చికిత్సా విధానాలను వివరించారు. తద్వారా ఐదేళ్ల లోపు పిల్లల మరణాలను నియంత్రించవచ్చని చెప్పారు. సమావేశంలో పీడియాట్రీషియన్లు డాక్టర్ రాంబాబు, డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ విల్సన్‌తో పాటు డీఐఓ డాక్టర్ రత్నకుమార్, వైద్య, ఆరోగ్య శాఖ స్టాటిస్టికల్ ఆఫీసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ద్వారంపూడి పరామర్శలు



ర్యాలి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబాలను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోమవారం పరామర్శించారు. స్థానిక 45వ డివిజన్ కొండయ్యపాలెం ప్రాంతానికి చెందిన మాజీ కార్పొరేటర్ ర్యాలి రాంబాబు ఇటీవల మరణించారు. ద్వారంపూడి తొలుత ఆయన నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా పని చేసే నీలాపు గణేష్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. జగన్నాథపురం తూరంగిపేట ప్రాంతానికి చెందిన మోసా రాజు తల్లి యల్లామణి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి వెంట మాజీ కార్పొరేటర్లు రోకళ్ల సత్యనారాయణ, చవ్వాకుల రాంబాబు, కర్రి శైలజ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జగన్‌ను మరోసారి సీఎంగా గెలిపించుకోవాలి

- క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ముఖ్యమంత్రి సలహాదారు (క్రైస్తవ విభాగం) ఫాదర్ బాల
- ఘనంగా జిల్లా క్రైస్తవ నాయకుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి ఫాదర్ బాల

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజారిటీతో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని సీఎం సలహాదారు (క్రైస్తవ విభాగం) ఫాదర్ బాల పిలుపునిచ్చారు. కాకినాడ బెరాకా బెస్సింగ్స్ చర్చిలో క్రైస్తవ నాయకుల జిల్లా స్థాయి ఆత్మీయ సమావేశం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాదర్ బాల మాట్లాడుతూ, క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవుల సమస్యలపై చర్చించేందుకు సీఎం ఆదేశాల మేరకు ఎనిమిది మంది సభ్యులతో కోర్ కమిటీని ఏర్పాటు చేయగా, అందులో కాకినాడ జిల్లా నుంచి ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీవుడ్, రాజమహేంద్రవరం నుంచి కొమనాపల్లి ప్రతాప్‌సిన్హా ఉన్నారని అన్నారు. దైవ సేవకులకు ఇస్తున్న రూ.8 వేల గౌరవ వేతనం మూడో విడత ఈ నెలాఖరులోగా అందేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనని ఫాదర్ బాల చెప్పారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కొమనాపల్లి ప్రతాప్‌సిన్హా మాట్లాడుతూ, క్రైస్తవుల సమస్యలపై సీఎం జగన్ సానుకూలంగా ఉంటారని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ, ఇటీవల మణిపూర్ రాష్ట్రానికి ఏఐసీసీ జిల్లా శాఖ నుంచి రూ.30 లక్షల ఆర్థిక సహాయం అందించామని చెప్పారు. అనంతరం ఫాదర్ బాలను, ప్రతాప్‌సిన్హాను జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, ఏఐసీసీ, ఇతర పాస్టర్స్ ఫెలోషిప్‌ల తరఫున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శామ్యూల్ సాగర్, జోసఫ్ బెన్ని, ఐజక్, జోయల్ రాజు, రిక్కీ గూటంతో కూడిన బృందం ఫాదర్ బాలకు తొమ్మిది వినతులు అందజేసింది. మతపరమైన కట్టడాలకు నిర్మాణ అనుమతులు సులభతరం చేయాలని, క్రైస్తవ వివాహ లైసెన్స్, నమోదు చేయాలని, క్రైస్తవ ఆస్తుల్ని పరిరక్షించాలని, దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని, జిల్లాలో కమ్యూనిటీ హాళ్లు, క్రైస్తవ శ్మశాన వాటికలు ఏర్పాటు, అభివృద్ధి చేయాలని, అసైన్డ్, పట్టా లేని స్థలాల్లో ఉన్న చర్చిలకు పట్టాలు జారీ చేయాలని, చర్చిల నిర్మాణానికి, మరమ్మతులకు ఆర్థిక సహాయం అందించాలని, చర్చిలపై దాడులను అరికట్టేందుకు పోలీసులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని, దిశ వంటి యాప్ రూపొందించాలని, క్రైస్తవ విద్యార్థులకు ఐఏఎస్ అకాడమీ ఏర్పాటు చేయాలని, చట్టసభలు, నామినేటెడ్, మైనారిటీ కమిషన్, కో–ఆప్షన్ పదవుల్లో క్రైస్తవులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రక్షణ టీవీ ఎండీ బెన్‌హర్, బిషప్ రెడ్డి జ్యోతికుమార్, బిషప్ జి.జోసఫ్ బెన్నీ, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు మోజెస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



రాకడ మహోత్సవంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని, అవి మంచి మార్గంలో నడిపించేలా చేస్తున్నాయని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కొవ్వాడ బైబిలు మిషన్ స్వస్థత శాల వద్ద సోమవారం జరిగిన రాకడ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రైస్తవులకు అండగా ఉన్నామని, ఏ అవసరం వచ్చినా తన వద్దకు రావాలని అన్నారు. కార్యక్రమంలో పాస్టరు రెవరెండ్ నక్కా శామ్యూల్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు దడాల జాషువా గిరి, కొవ్వాడ సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, ఉప సర్పంచ్ తోటకూర శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కండిల్లి రవి, డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

- రక్షించిన పోలీసులు
- బంధువులకు అప్పగింత



వరుణ్‌సూర్యను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: ప్రేమ విఫలం కావడం, తల్లిదండ్రులు మృతి చెందడంతో మనస్తాపానికి గురైన ఒక యువకుడు ఆదివారం సముద్రంలో పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన సూరాడ వరుణ్ సూర్య ఇటీవల ఒక యువతిని ప్రేమించాడు. ఆమె తిరస్కరించింది. ఇదిలా ఉండగా అనారోగ్యం కారణంగా వరుణ్ సూర్య తల్లిదండ్రులు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉప్పాడ – కాకినాడ బీచ్ రోడ్డులోని ఎస్‌పీజీఎల్ సమీపాన సముద్రంలో పడి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన పర్యాటకులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. అదే సమయానికి బీచ్ రోడ్డులో విధులు నిర్వహిస్తున్న ఎస్సై స్వామినాయుడు.. స్థానిక మత్స్యకారుల సహాయంతో వరుణ్ సూర్యను రక్షించి, ఒడ్డుకు చేర్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు.

ఆనంద దీపావళి



కుటుంబ సభ్యులతో క్రాకర్స్ కాలుస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



దీపావళి సందడిలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు

వెలుగుల వేడుక దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రమణయ్యపేట వైద్య నగర్–1లోని తన నివాసంలో తండ్రి సత్యనారాయణ, సోదరుడు కల్యాణ కృష్ణ, కుటుంబ సభ్యులతో కలసి మతాబులు, కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు వంటివి కాల్చి సందడి చేశారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు కూడా తమ నివాసంలో దీపావళి వేడుకను సంతోషంగా నిర్వహించుకున్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తన కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తూ ఆనందంగా గడిపారు.

– కాకినాడ రూరల్/కాకినాడ



కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ దీపావళి సందడి

శ్రీపీఠం.. ఆధ్యాత్మిక వైభవం

- నేటి నుంచి మహాశక్తి యాగం, బగళాముఖి అమ్మవారి హోమం
- శతకోటి కుంకుమార్చన
- రోజూ 12 వేల మంది మహిళలతో నెల రోజుల పాటు పూజలు
- మహా నక్షత్ర శాంతి, తిథి పూజలు, అతిరుద్ర యాగం
- రోజూ 5 వేల మంది మహిళలతో దీపోత్సవం


కాకినాడ రూరల్: కార్తిక మాసం ప్రారంభమయ్యే మంగళవారం నుంచే కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఆధ్యాత్మిక వైభవానికి తెర లేవనుంది. దేశ చరిత్రలోనే తొలిసారిగా పరిపూర్ణానంద స్వామి దివ్య ఆశీస్సులతో ఆయన ఆధ్వర్యాన మహాశక్తి యాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదిపరాశక్తి దివ్యరూపంగా కొలిచే బగళాముఖి అమ్మవారికి కోటిజప, తర్పణ, హోమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అమ్మవారికి ప్రత్యేకంగా గుడి కట్టారు. యాగశాలను ప్రత్యేకంగా రూపొందించారు. మహా నక్షత్ర, తిథి హోమాలతో పాటు అతిరుద్ర యాగం, శతకోటి (100 కోట్ల) కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ మహాశక్తి యాగం కోసం శ్రీపీఠం వెనుకన గోశాల ప్రాంగణంలో విశాలమైన ఖాళీ స్థలాన్ని ఎత్తు చేసి, పలు నిర్మాణాలతో సిద్ధం చేశారు. మహాశక్తి యాగం నిర్వహించే షెడ్‌ను 12 వేల మహిళలు కూర్చునేందుకు వీలుగా అందంగా తీర్చిదిద్దారు. యాగంలో పాల్గొనే వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నారు. మహాశక్తి యాగం కోసం 1,200 మంది వలంటీర్లు కొన్ని రోజులుగా సేవలందిస్తున్నారు. వీరిలో ఐటీ కంపెనీల్లో పని చేస్తున్నవారు సైతం ఉండటం విశేషం. వీరందరూ మహాశక్తి యాగంలో పాల్గొనే మహిళల రిజిస్ట్రేషన్, ఐడీ కార్డుల జారీ, విస్తృత ప్రచారం, యాగశాల ప్రాంగణంలో ఏర్పాట్లు తదితర పనులు నిర్వహిస్తున్నారు.

ప్రతి రోజూ మహా క్రతువు జరుగుతుందిలా..

- ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు మహానక్షత్ర శాంతి పూజ జరుగుతుంది. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మహానక్షత్ర జపం, ఆ రోజు నక్షత్రానికి 9 గంటల వరకూ పూజ నిర్వహిస్తారు. మహాశక్తి యాగం జరుగుతుంది.
- ఉదయం 8 గంటలకు యాగశాలలో బగళాముఖి జపం, బగళాముఖి అనుష్ఠానం, రుద్ర పారాయణ, రుద్ర జపం, అతిరుద్ర, నక్షత్ర శాంతి జరుగుతాయి.
- ఉదయం 9.30 గంటలకు మహాశక్తి యాగం ప్రాంగణంలో 12 వేల మంది మహిళలు ఆశీనులవుతారు. ప్రతి రోజూ ఒక్కొక్క స్వామీజీ, పండితులు అనుగ్రహ భాషణం చేస్తారు. అనంతరం 10 నుంచి 10.30 గంటల మధ్య కుంకుమార్చన ప్రారంభమవుతుంది. కుంభకోణంలో 120 కేజీల పంచలోహాలతో తయారు చేయించిన పార్వతీ పరమేశ్వరుల మూర్తులకు ఈ కుంకుమార్చన నిర్వహిస్తారు. మూడుసార్లు పారాయణ ద్వారా మధ్యాహ్నం 12 గంటలకు కుంకుమార్చన పూర్తి చేస్తారు.
- అనంతరం మధ్యాహ్న భోజనం.
- ప్రతి రోజూ సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక ప్రాంగణంలో కోటి దీపోత్సవం జరుగుతుంది. దీని కోసం ఆవుపేడ, గోదావరి ఒండ్రు మట్టితో తయారు చేసిన ప్రమిదలు ఏర్పాటు చేస్తున్నారు. దీపోత్సవంలో 5 వేల మంది కూర్చుని పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.
- రాత్రి 7 గంటలకు బగళాముఖి హోమం ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారికి 4.75 లక్షల మంత్రోచ్చారణ చేస్తారు. 8 గంటల వరకూ జరిగే ఈ హోమంలో 41 రకాల మూలికలు వినియోగిస్తారు.
- రాత్రి 8.30 గంటలకు గంగానది ఏడు పాయల నుంచి సేకరించిన తీర్థాలను ఆ రోజు ఇతర తీర్థాలను కలిపి ప్రసాదంగా అందజేస్తారు.



బగళాముఖి హోమం, నక్షత్ర హోమం జరిగే యాగ శాల పనుల్లో నిమగ్నమైన మహిళలు



దీపోత్సవ ప్రాంగణం సాంస్కృతిక కార్యక్రమాల వేదిక వద్ద పచ్చని కొండల్ని తలపించేలా ప్రత్యేక ఏర్పాటు



శ్రీపీఠంలో మహాశక్తి యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిపూర్ణనంద స్వామి

వారి కుటుంబాలకు శ్రీరామరక్ష

దేశంలో మరెక్కడా లేని విధంగా ఏర్పాటు చేసిన ఈ ప్రాంగణంలో మహిళలతో చేసే శత కోటి కుంకుమార్చన చాలా విశిష్టమైనది. మహాశక్తి యాగంలో పాల్గొనే మహిళల కుటుంబ సభ్యులకు శ్రీరామరక్ష తప్పకుండా ఫలితంగా లభిస్తుంది. ఇదో మహా యజ్ఞం. అందరూ పాల్గొనాలి. విదేశాల్లో ఉన్న వారితో ప్రతి ఆదివారం ఉదయం 7.30 గంటల (భారత కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం) నుంచి గంట సేపు లైవ్‌లో కనెక్ట్ అవుతాను.

– పరిపూర్ణానంద స్వామీజీ, పీఠాధిపతి, కాకినాడ శ్రీపీఠం